సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



3,239 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటివెలుగులో 3,239 మందికి పరీక్షలు చేశారు. కొలనూర్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ఎంపీపీ చంద్రయ్య గౌడ్ క్యాంప్‌ను సందర్శించారు.



రోడ్డు పనులు పరిశీలన

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి నుంచి మానాల వరకు వేస్తున్న ప్రధాన రహదారి పనులను గురువారం బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, రాజారాం, రాజేశం, అంజయ్య పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
39.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

అహంభావి, ప్రగల్భాలు పలికే మనిషికి దైవానుగ్రహం లభించదు.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్: శుక్ర 6:37

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

వీపీవో వ్యవస్థను పటిష్టం చేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లక్రైం: శాంతిభద్రతలను కాపాడేందుకు జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి సమాచారం సేకరించేందుకు వీపీవో(విలేజ్ పోలీసు ఆఫీసర్) వ్యవస్థను పటిష్టం చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం పెండింగ్ కేసులు, గ్రేవ్ కేసులు, మహిళా సంబంధిత కేసులు, ఎస్సీ ఎస్టీ కేసుల పురోగతిపై సమీక్షించారు. గ్రామస్థాయిలో ఇన్ఫర్మేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తరచూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలన్నారు. కేసుల పరిష్కారానికి నాణ్యమైన విచారణ చేపట్టాలని సూచించారు. గంజాయి సరఫరా చేసే మూలాలను నిర్వీర్యం చేయాలన్నారు. ఫంక్షనల్ వర్టికల్స్ పటిష్టంగా అమలుచేస్తూ గత నెలలో మెరుగైన సేవలందించిన 44 మందికి ప్రశంసాపత్రాలు అందించారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు విశ్వప్రసాద్, రవికుమార్, సీఐలు అనిల్‌కుమార్, ఉపేందర్, మొగిలి, వెంకటేశ్, బన్సీలాల్, కిరణ్, కరుణాకర్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



వేములవాడరూరల్: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని డీఈవో రమేశ్ కుమార్ సూచించారు. వేములవాడ పరిధిలోని కోనాయపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు బూర సదానందం, అరుణ, లక్ష్మణ్, శ్రీనివాస్, బాబు, సుచరిత ఉన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలన



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలో ఉపాధిహామీ పనులను సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సుదర్శన్ గురువారం పరిశీలించారు. సారంపల్లి, ఓబులాపూర్, కస్బెకట్కూర్, మండెపల్లి, తంగళ్లపల్లి గ్రామాల ఈజీఎస్ రికార్డులను తనిఖీ చేసి చేయడంతోపాటు గ్రామ చెరువులను పరిశీలించారు. జేఈ రాజనర్సు, టీఏలు సుష్మ, మనోహర్, లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్లు దేవయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



సిరిసిల్లఅర్బన్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి 10వ వార్డు చిన్నబోనాలలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్యతో కలిసి గురువారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ బొల్గం నాగరాజ్‌గౌడ్, రైతుబంధు మండలాధ్యక్షుడు అగ్గిరాములు, నాయకులు జిందం చక్రపాణి, శ్రవణ్‌రావు, బండారి శ్యామ్ పాల్గొన్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వారు మల్లవేణి రాజు భార్య, పిల్లలు. గతేడాది సర్దాపూర్ వద్ద కంటైనర్ ఢీకొట్టడంతో రాజు మరణించగా భార్య సుమలత, ఇద్దరు కొడుకులు మణిదీప్, విక్రమ్ అనాథలయ్యారు. మేస్త్రీ పనిచేసే కుటుంబ పెద్ద మరణంతో వారికి అంతుచిక్కని వేదన మిగిలింది. వృద్ధాప్యంలో ఉన్న తండ్రితోపాటు సుమలత, ఇద్దరు పిల్లల పోషణ ప్రశ్నార్థకంగా మారింది. రోడ్డున పడ్డ రాజు కుటుంబం మాదిరిగానే జిల్లాలో ఏడాదిలో 69 కుటుంబాలు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి.

ఈ ఫొటో వెంకటాపూర్ శివారులోని ప్రమాదకరమైన మూలమలుపు. వారంలో రెండు, మూడు ప్రమాదాలు ఇక్కడ జరుగుతూనే ఉన్నాయి. ఈ మూలమలుపును ప్రయాణికులు డేంజర్‌స్పాట్‌గా భావిస్తారు. ఇటీవల జరిగిన రెండు సంఘటనల్లో ఇద్దరు మరణించారు. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపైనే ఉన్న ఈ మూలమలుపు వద్ద కనీసం హెచ్చరికబోర్డు లేదు. దీంతో విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.



డేంజర్ స్పాట్స్

- ప్రాణాలు పోతున్నాయి
- మృత్యుస్థావరాలుగా మూలమలుపులు
- అతివేగం..అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు
- నెలలోనే 38 సంఘటనలు
- ఐదుగురు మృతి.. 79 మందికి గాయాలు
- కనిపించని హెచ్చరిక బోర్డులు



ఎల్లారెడ్డిపేట-రాగట్లపల్లి మధ్య గల ప్రమాదకర మూలమలుపు వద్ద కనిపించని హెచ్చరిక బోర్డులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లాలో ప్రమాదకర రోడ్లపై ప్రయాణం భయం..భయంగా సాగుతోంది. ఊరికో మూలమలుపు డేంజర్ స్పాట్‌గా మారాయి. మూలమలుపుల వద్ద కనీసం హెచ్చరికబోర్డులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఫలితంగా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడపడం.. అతివేగంగా ఇసుక రవాణా వాహనాలు వెళ్తుండడం, భారీ వాహనాలతో ఇటీవల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా తిరిగి వస్తాడో.. రాడోననే అనుమానాలు వెంటాడుతున్నాయి. జిల్లాలో నెల రోజుల వ్యవధిలో 38 రోడ్డు ప్రమాదాలు జరుగగా... ఐదుగురు చనిపోగా, 79 మంది గాయపడ్డారు. ఇందులో 22 ప్రమాదాలు ఇసుక ట్రాక్టర్లతోనే జరగడం గమనించాల్సిన విషయం. గాయపడిన వారిలో 30 శాతం మంది పనులు చేయలేని పరిస్థితుల్లో అంగవైకల్యులుగా మారారు. జిల్లాలో రోజూ ఏదో ఒక మూలమలుపు వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ప్రమాదకర మూలమలుపులు ఇవే..

- రాజన్నసిరిసిల్ల జిల్లాలోని కామారెడ్డి–కరీంనగర్ ప్రధాన రహదారిపై ప్రమాదకర మలుపులు.. పెద్దమ్మస్టేజీ, గోరింట్యాల, సముద్రలింగాపూర్, రాచర్లగొల్లపల్లి(సత్తెపీరీల దర్గా),
- రాగట్లపల్లి, వెంకటాపూర్, పెద్దూరు, సర్దాపూర్, సిరిసిల్ల బైపాస్‌రోడ్డు, చంద్రంపేట ఎక్స్ రోడ్డు, వేములవాడ కమాన్, నాంపల్లిగుట్ట, కొదురుపాక, వెంకట్రావుపల్లి వద్ద ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి.
- సిరిసిల్ల–సిద్దిపేట మార్గంలో.. తంగళ్లపల్లి, పద్మనగర్ శివారులోని పెట్రోల్‌బంక్ వద్ద, జిల్లెల్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి.
- జిల్లాలోని అంతర్గత రహదారుల్లో ఇలా.. కంచర్ల, వీర్నపల్లి సబ్‌స్టేషన్లు, ముస్తాబాద్ శివారులో రెండు చోట్ల, ఎల్లారెడ్డిపేట బైపాస్ రోడ్డు ప్రమాదకరంగా మారాయి.
- వేములవాడ–కోరుట్ల మార్గంలో.. చందుర్తి మూలమలుపు, రుద్రంగి శివారు, కథలాపూర్‌లో రెండు చోట్ల అత్యంత ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి.
- ఈ మార్గాల్లో ఎక్కడ కూడా హెచ్చరికబోర్డులు కానీ, ఎలాంటి రక్షణ చర్యలు కానీ అధికారులు తీసుకోలేదు.

నెల రోజుల్లో 38 ప్రమాదాలు

జిల్లా వ్యాప్తంగా నెల రోజుల వ్యవధిలో పోలీసుల రికార్డుల ప్రకారం 38 ప్రమాదాలు జరిగాయి. ఆయా సంఘటనల్లో ఐదుగురు మరణించగా.. 79 మంది గాయాలతో బయటపడ్డారు. కాగా అనధికారికంగా 60కి పైగా రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు సమాచారం. కొన్ని ప్రమాదాల్లో ప్రాణాలు పోతే తప్ప పోలీసుల దృష్టికి రావడం లేదు. జిల్లాలో రెండు నెలల వ్యవధిలో ఇసుక ట్రాక్టర్లతోనే 22 ప్రమాదాలు జరిగాయి. కాగా కుటుంబ పోషణ కోసం వివిధ పనుల రీత్యా బయటకు వెళ్తున్న వారు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడంతో బాధిత కుటుంబాలు వీధిన పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఐదుగురు ఒకే నెలలో రోడ్డు ప్రమాదాల్లో మరణించడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రస్తుతం ఆ కుటుంబాలు దుర్భర జీవితాలు గడుపుతున్నాయి. పిల్లలను చదవించే స్తోమత లేక వారు కూలీలుగా మారిపోతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పట్టించుకోని అధికారులు



అతి ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్న చోట అధికారులు కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. మూలమలుపుల వద్ద రేడియం స్టిక్కర్స్ ఏర్పాటు చేస్తే రాత్రి పూట సులువుగా గుర్తుపట్టే అవకాశం ఉంటుంది. ఈ మార్గాల్లో కొత్త వారు ప్రయాణించినప్పుడు మూలమలుపులు తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలి.

– పొన్నాల తిరుపతిరెడ్డి, వెంకటాపూర్

అతివేగంతోనే ప్రమాదాలు



మద్యం సేవించి అతివేగంగా వాహనాలు నడపడంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ డంకెన్ డ్రైవ్ ప్రతి రోజూ నిర్వహిస్తోంది. మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖకు విన్నవించాం. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

– మొగిలి, సీఐ, ఎల్లారెడ్డిపేట

మినీస్టేడియం పనులు త్వరగా పూర్తి చేయండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



వేములవాడఅర్బన్: మినీస్టేడియం పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. తిప్పాపూర్‌లో నిర్మిస్తున్న మినీస్టేడియం పనులను గురువారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రికెట్‌గ్రౌండ్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఫుట్‌బాల్ కోర్టులను సిద్ధం చేయాలన్నారు. ఇండోర్ స్పోర్ట్స్ కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు. సింథటిక్ ట్రాక్‌ను సిద్ధం చేయాలన్నారు. రాత్రిపూట ఆడుకునేందుకు లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పనులు వేర్వేరుగా ఏకకాలంలో చేపట్టి నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఈఈ విరూపాక్ష, సహాయ ఇంజినీర్ శ్రీకాంత్ ఉన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలే లక్ష్యం



రుద్రంగి(వేములవాడ): మెరుగైన విద్యుత్ సేవలందించడమే లక్ష్యంగా సెస్ పాలకవర్గం పనిచేస్తుందని చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. రుద్రంగిలో ఏర్పాటు చేస్తున్న సెస్ కార్యాలయాన్ని గురువారం పరిశీలించారు. వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబు శుక్రవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంపీపీ స్వరూపారాణి, జెడ్పీటీసీ మీనయ్య, సెస్ డైరెక్టర్ గంగారాం, నాయకులు మహేశ్, నర్సయ్య, కమలాకర్, గణేశ్, లక్ష్మణ్ ఉన్నారు.

ఆస్పత్రి నిర్మాణంలో పేలుళ్లు

ముస్తాబాద్(సిరిసిల్ల): పోతుగల్ పీహెచ్‌సీలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణానికి గురువారం జరిపిన పేలుళ్లతో రోగులు, వైద్యసిబ్బంది ఆందోళనకు గురయ్యారు. బండరాయిని తొలగించేందుకు జిలెటిన్ స్టిక్స్‌ను పేల్చారు. భారీ శబ్దాలతో బండరాళ్లు ఎగిరి ఆస్పత్రిపై పడడంతో భవనానికి పలుచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. పేలుళ్లు జరిపే సమయంలో అటు వైపు ఎవరూ రాకుండా జాగ్రత్తలు తీసుకోకపోవడంపై బీఎంఎస్ జిల్లా కన్వీనర్ తోట ధర్మేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముస్లింల సంక్షేమానికి కృషి



సిరిసిల్లలో ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో కలెక్టర్, ఎస్పీలు

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- సిరిసిల్లలో ఇఫ్తార్ విందు

సిరిసిల్లటౌన్: ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని కలెక్టర్ అనురాగ జయంతి అన్నారు. సిరిసిల్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. మతాలకతీతంగా సఖ్యత, ఐక్యతను పెంపొందించుకోవాలన్నారు. ఎస్పీ అఖిల్‌మహాజన్, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శంకరయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, మైనార్టీ సంక్షేమాధికారి సర్వర్‌మియా, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఉన్నారు.

అభివృద్ధిపై చర్చను తట్టుకోలేకనే దుష్ప్రచారం

- అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- చందుర్తిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



చందుర్తిలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

చందుర్తి(వేములవాడ): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చను తట్టుకోలేకనే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపై నిందలు మోపుతున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. చందుర్తిలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటైతే కరెంట్ ఉండదన్న వారికి 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తూ సమాధానం ఇచ్చామన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపిస్తే అభివృద్ధి చేయడం మరిచి బీఆర్ఎస్ నాయకులను తిట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నాడన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సింగరేణిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

రూ.200 కోట్లతో అభివృద్ధి చేశాం..

చందుర్తి మండలాన్ని రూ.200 కోట్లతో అభివృద్ధి చేశామని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు తెలిపారు. ఏమైన పనులు మిగిలి ఉంటే ఆగస్టు నెలాఖరు వరకు పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. ఎల్లంపల్లి మిగులు పనుల పూర్తికి రూ.42 వేల కోట్లు అవసరమని.. ఆ నిధులు మంజూరైతే త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, ఎంపీపీ బైరగోని లావణ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, కేడీసీసీబీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, చందుర్తి సింగిల్ విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, మందాల అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

‘ముక్కోటి’కి ముందురోజే ముహూర్తం..!

- ‘అరుణ్ తలకోస్తా’ అని సాయి శపథం
- ‘సాక్షి’ చేతిలో సాయి వార్నింగ్ వీడియో
- సాయి గ్యాంగ్ కాల్పులతో ఉలిక్కిపడిన మానకొండూరు
- గురితప్పిన రెండు రౌండ్లు. పేలని రౌండ్ స్వాధీనం
- పొరుగింట్లోకి దూరి ప్రాణాలు కాపాడుకున్న అరుణ్
- అడ్డొచ్చిన మొత్తం ఏడుగురిని చావబాదిన దుండగులు
- సోదరి మరణానికి ప్రతీకారంగానే హత్యాయత్నం
- రెండు నెలల క్రితమే బిహార్ నుంచి ఆయుధం..?

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/మానకొండూరు: బుధవారం అర్ధరాత్రి కాల్పుల మోతతో మానకొండూరు ఉలిక్కిపడింది. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే పల్లెలో తుపాకుల గర్జన విని జనం భీతిల్లారు. రౌడీషీటర్ అరుణ్‌పై కత్తులు, తుపాకులతో జరిగిన హత్యాయత్నం జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. నేరచరిత్ర కలిగిన అరుణ్ ఆది నుంచి వివాదాస్పదుడే. వరుసగా ఇతనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గత సీపీ సత్యనారాయణ ఇతనికి కమిషరేట్ నుంచి బహిష్కరణ విధించారు. ఇటీవల కమిషనరేట్ బహిష్కరణ పూర్తిచేసుకుని వచ్చిన అరుణ్‌పై తుపాకులతో హత్యాయత్నం జరగడం గమనార్హం. వాస్తవానికి ఈ ఘటనకు బీజం ఇప్పుడు పడింది కాదు, పాత కక్షల నేపథ్యంలో ఈ ఏడాది వైకుంఠ ఏకాదశికి ముందురోజు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎంకాలనీలో ప్రధాన నిందితుడు సాయితేజ్ హనుమాన్ ఆలయంలోనే అరుణ్‌ని చంపుతానని ప్రతినబూనాడు.

వస్తూనే దాడి.. కాల్పులు

- పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీలో ఉండే వీణవంక సాయితేజ్ ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి ముందురోజు రాత్రి (నూతన సంవత్సరం రోజు) జీఎం కాలనీలోని హనుమాన్ గుడిలో తన సోదరి మరణానికి కారణమైన ‘మానకొండూరు అరుణ్ గాని తలకాయ కోసి.. జీఎం కాలనీ చౌరస్తాలో పెట్టకపోతే నేను సూరి కొడుకునే కాదు’ అని శపథం చేశాడు.
- ఈ విషయాన్ని పలువురు స్థానికులు వీడియో కూడా తీశారు. ఇప్పుడు ఈ వీడియో కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ వీడియో ‘సాక్షి’ చేతికి చిక్కింది. అప్పటి నుంచి సమయం కోసం ఎదురుచూస్తున్న సాయి.. బుధవారం అర్ధరాత్రి తన మిత్రులు భువనగిరి జిల్లా దత్తారుపల్లికి చెందిన పాల మల్లేశ్, మానకొండూరు మండలం కెల్లెడకు చెందిన బైరగోని మధు, గోదావరిఖనికి చెందిన చంటితో కలిసి రాత్రి 9 గంటల సమయంలో వాహనంలో మానకొండూరుకు వచ్చాడు.
- వెల్దికి వెళ్లే మార్గం నుంచి వీరు గ్రామంలోకి తుపాకీ, కత్తులతో వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. దాదాపు 9.30 గంటల సమయంలో అరుణ్ తన ఇంటి ముందు సోదరులతో కలిసి మద్యం తాగుతుండగా.. వీరికి తారసపడ్డాడు. వారిని చూడగానే భయంతో అరుణ్ పారిపోయేందుకు యత్నించాడు.
- అతడిని వెంబడించిన నలుగురు బీరు బాటిళ్లతో దాడిచేశారు. అడ్డువచ్చిన అరుణ్ భార్య సుమ, పెద్ద కూతురు వైష్ణవిని తుపాకీ చూపించి తీవ్రంగా కొట్టారు. పారిపోతున్న అరుణ్‌పై రెండు రౌండ్లు కాల్పులు జరపగా గురితప్పాయి. ఓ ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. అరుణ్‌పై కోపంతో సదరు ఇంట్లోని ఐదుగురు కుటుంబసభ్యులను విచక్షణారహితంగా, రక్తాలు కారేలా కొట్టారు.
- వీరి అరుపులు విన్న స్థానికులు వచ్చారు. వచ్చిన వారిని తుపాకీ చేతబూనిన వ్యక్తి బెదిరించి పంపాడు. తరువాత చాలామంది రావడంతో సాయితేజ్ పరారు కాగా.. పాలమల్లేశ్, మధును పట్టుకున్న స్థానికులు పోలీసులకు అప్పగించారు.
- పేలని బుల్లెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వాడింది కంట్రీమేడ్ తుపాకీ(తపంచా) అని తూటా ఆధారంగా నిర్ధారణకు వచ్చారు. మరో నిందితుడు చంటి కూడా పోలీసుల అదుపులోనే ఉన్నాడని సమాచారం.

తనకు సంబంధం లేదంటున్న అరుణ్

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అరుణ్‌ను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. నిందితులు గోదావరిఖనికి చెందిన సాయితేజ్, చంటి, మరో ఇద్దరు మిత్రులు అని వెల్లడించాడు. ఎందుకు దాడి చేశారు..? అని అడిగిన ప్రశ్నకు.. తాను ఒక ప్రభుత్వ ఉద్యోగిని అని, తనకువారితో ఎలాంటి సంబంధమూ లేదని, వారు గంజాయి విక్రయిస్తారని తెలిపాడు. సంబంధం లేని వ్యక్తి చేసే పని, చిరునామా, పేరుతో సహా ఎలా తెలపగలిగాడు..? అన్న విషయంపై పోలీసులు దృష్టి సారించారు. అతనికి సాయితేజకు ఉన్న వైరం ఏంటీ..? అతని సోదరి మరణంలో అరుణ్ ప్రమేయం ఎంతవరకు ఉంది..? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. నిందితులకు, బాధితుడికి నేరచరిత ఉన్న విషయం వాస్తవమేనని, అన్ని కోణాల్లోనూ కేసు దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు ‘సాక్షి’కి తెలిపారు. నిందితుల కోసం మొత్తం మూడు బృందాలు సాయి కోసం గాలిస్తున్నాయి. ఇందులో రెండు హైదరాబాద్‌కు వెళ్లగా.. ఒక టీం గోదావరిఖనికి వెళ్లినట్లు సమాచారం.

బిహార్ నుంచి ఆయుధం..?

ఈ కేసులో ప్రధాన నిందితుడు సాయికి ఆయుధం ఎక్కడిది..? అన్న విషయంపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తుపాకీ కాల్చడంలో నిందితులకు అనుభవం లేదని తాజా ఘటనతో తేలిపోయింది. బుల్లెట్లు వేగంగా లోడు చేయలేకపోవడం.. గురిచూసి కాల్చలేకపోయిన విధానాన్ని బట్టి నిందితులు ఇటీవలే తుపాకీ కొనుగోలు చేసి ఉంటారని పోలీసులు అంచనాకు వచ్చారు. రెండు నెలల క్రితం ఓ కేసు విషయంలో సాయి సెల్‌లోకేషన్ బిహార్‌లో చూపించిందని గోదావరిఖని పోలీసులు తెలిపారు. అదే సమయంలో అతను కాశీయాత్రకు వెళ్లి వచ్చాడని గుర్తుచేసుకుంటున్నారు. దీంతో సాయికి బిహార్‌లో మిత్రులు ఉండి ఉంటారని, వారి ద్వారానే ఆయుధం కొని ఉంటాడని అనుమానిస్తున్నారు.



అరుణ్‌ని చంపుతానంటున్న సాయి (ఫైల్)



గాయపడ్డ అరుణ్

మాట్లాడకుండానే..దాడి చేసారు



మానకొండూర్‌లో ఉన్న మా అత్త గారింటికి నా పిల్లలను చూసేందుకు వచ్చాను. బుధవారం రాత్రి అన్నం తిని బయట ఉండగా గొడవ అవుతోంది. ఈ లోగానే అరుణ్ మా ఇంటి వైపు వచ్చాడని కొందరు మా ఇంటివైపు పరుగు తీసుకుంటూ వచ్చారు. వాడేడి అంటూ ఆగ్రహంతో నాపై స్టీలు ప్యాల క్యాన్‌తో దాడి చేశారు. తల పగిలి రక్తస్రావం జరిగింది. ఇంట్లో వాళ్లపై దాడి చేశారు. ఏం జరుగుతుందో అర్థం కాలేదు. తర్వాత భయాందోళనతో చాలా సేపు తలుపు వేసుకుని ఇంట్లోనే ఉన్నాం, పోలీసులు వచ్చాక బయటకు వచ్చా.

– బీరం శ్రీనివాస్, గాయపడ్డ వ్యక్తి

క్లుప్తంగా

నియామకం


మహేందర్ యాదవ్

వేములవాడ అర్బన్: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా బత్తుల మహేందర్ యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు మేక పోతుల నరేందర్‌గౌడ్ అందజేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు


శ్రీ వేణుగోపాల స్వామివారు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. నిధులు మంజూరుపై గురువారం ఆలయం ముందు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ..గతంలో మంత్రి కేటీఆర్ ఆలయ నిర్మాణానికి రూ.2 కోట్లు ఇస్తానని ప్రకటించారని, ఈ మేరకు నిధులు మంజూరు చేశారన్నారు. తొందర్లోనే మంత్రి కేటీఆర్ చేతులమీదుగా పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరపున కూడా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లోని సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఅర్బన్: ఎస్సీ స్టడీ సర్కిల్‌లోని సమస్యలు పరిష్కరించాలని పలువురు అభ్యర్థులు కలెక్టర్ అనురాగ్ జయంతికి విన్నవించారు. స్టడీ సర్కిల్‌లోని సమస్యలపై కలెక్టర్‌కు విన్నవించేందుకు వచ్చిన వారు మాట్లాడారు. ఎస్సీ స్టడీసర్కిల్‌లో తరగతులు ప్రారంభించి 53 రోజులు గడుస్తున్న నామ మాత్రంగానే కొనసాగుతున్నాయన్నారు. స్టడీసర్కిల్ ఇన్‌చార్జి పట్టించుకోవడం లేదన్నారు.

పాఠశాలలో ఫీజుల వేధింపులు

- పోలీసులు, ఎంఈవోకు తల్లిదండ్రుల ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఫీజుల కోసం వేధిస్తున్నారని విద్యార్థిని తల్లిదండ్రులు గురువారం పోలీసులు, ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. మండలకేంద్రానికి చెందిన కట్కూరి భారతి–బాబు దంపతుల కుమారులు స్థానిక ఓ ప్రైవేట్ స్కూల్‌లో 3వ, 1వ తరగతులు చదువుతున్నారు. విద్యాసంవత్సరం ముగియనుండడంతో ఫీజులు చెల్లించాలని ప్రిన్సిపాల్ వెధింపులకు గురిచేశారని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఫీజుల కోసం తమ కుమారుడు సుకుమార్‌ను స్కూల్ సమయం దాటిన తర్వాత ఇంటికి పంపకుండా పాఠశాలలోనే ఉంచారని పేర్కొన్నారు. ఫీజుల కోసం వేధిస్తున్న పాఠశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని దంపతులు కోరారు. ఈ విషయంపై స్కూల్ ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. ఫీజుల కోసం వేధించామనడంలో వాస్తవం లేదన్నారు. ఎన్నో సార్లు తల్లిదండ్రులు పాఠశాలకు రావడం ఆలస్యమైతే వారి పిల్లలను తామే చూసుకున్నామని తెలిపారు. ఫీజుల్లో కూడా రాయితీ ఇచ్చామని, కావాలని అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

అగ్గి రగిలితే బుగ్గి

- జిల్లాలో వరుసగా అగ్ని ప్రమాదాలు
- కాలిబూడిదవుతున్న ఆస్తులు
- మరో ఫైర్‌స్టేషన్‌కు ప్రతిపాదనలు
- మంజూరుకాని వైనం
- రీజినల్ ట్రైనింగ్ సెంటర్‌కు అవకాశం
- సిరిసిల్ల ఫైర్ ఆఫీసర్ సతీశ్‌రావు


సిరిసిల్ల ఫైర్ స్టేషన్

సిరిసిల్ల క్రైం: ఎండాకాలంలో ఏటా అగ్నిప్రమాదాలలో కోట్ల ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి. ఇటీవల ఎండలు ముదరడంతో జిల్లాలో వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాది 32 అగ్నిప్రమాదాలు జరుగగా.. రూ.2.25కోట్ల ఆస్తి నష్టం ఏర్పడింది. ఏటా వేసవిలో జరుగుతున్న ప్రమాదాలలో పెద్ద ఎత్తున ఆస్తి కాలిబూడిదవుతుంది. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడల్లో ఫైర్‌స్టేషన్‌లు ఉన్నాయి. జిల్లా సరిహద్దు మండలాలైన గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, చందుర్తి, రుద్రంగి ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే అగ్నిమాపక సిబ్బంది చేరుకునే సరికి ఆస్తులు కాలిబూడిదవుతున్నాయి. ఈ నేపథ్యంలో మరో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్ని డిమాండ్ ఉంది.

రూ.2.25 కోట్ల ఆస్తినష్టం

రాజన్నసిరిసిల్ల జిల్లాలో గతేడాది 32 అగ్ని ప్రమాదాలలో రూ.2.25 కోట్ల ఆస్తి నష్టం జరిగింది. 31 ప్రమాదాల్లో రూ.25 లక్షల వరకు నష్టం ఏర్పడితే.. తంగళ్లపల్లి సివిల్ సప్లయ్ గోదాంలో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.2 కోట్ల ఆస్తి నష్టం జరిగింది. ప్రమాదం జరిగిందని తెలియడంతో సకాలంలో చేరుకొని రూ.50 లక్షల వరకు ఆస్తిని కాపాడినట్లు ఫైర్ అధికారి తెలిపారు.

సుదూర మండలాలకు చేరడం ఇబ్బంది

జిల్లాలోని అగ్నిప్రమాదాలు జరిగితే సకాలంలో చేరడానికి ప్రయత్నించిన దూరభారంతో చేరలేకున్నట్లు ఫైర్‌స్టేషన్ ఉద్యోగులు చెబుతున్నారు. గంభీరావుపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట, రుద్రంగి వంటి జిల్లా సరిహద్దు మండలాలు, వాటి గ్రామాలకు అగ్నిమాపకశాఖ సేవలు అందించేందుకు ఇబ్బందులున్నాయి. వీటిని అధిగవించేందుకు ఎల్లారెడ్డిపేటలో ఒక ఫైర్‌స్టేషన్, వేములవాడలోని మరో ఫైర్‌స్టేషన్‌ను డబుల్ యూనిట్‌గా మార్చాలని 2021లో ప్రతిపాదనలు పంపారు. అయితే అవి మంజూరు కావడం లేదు.

మిగతా జిల్లాలో పోల్చితే భేష్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఫైర్‌స్టేషన్లలో సిబ్బంది మిగతా జిల్లాలతో పోల్చి చూసినప్పుడు సంతృప్తికరంగానే ఉన్నారు. 20 మంది ఫైర్‌మెన్స్‌కు 6 ఖాళీలు, డ్రైవర్ ఆపరేటర్స్ ఆరుగురికి నాలుగు ఖాళీలు ఉన్నాయి. కొత్తగా రెండు ఫైర్‌స్టేషన్‌లు ఏర్పాటు చేస్తే అదనపు సిబ్బంది అవసరం ఉంటుంది. సిరిసిల్ల స్టేషన్‌లో ఒక వాటర్‌టెండర్, మరో మినీవాటర్ టెండర్, ఒక పోర్టబుల్ పంపు, మిస్ట్‌బుల్లెట్ ఉన్నాయి. వేములవాడలో స్టేషన్‌కు ఒక మల్టీపర్పస్ టెండర్, ఒక పోర్టబుల్ పంపు, ఒక మిస్ట్ బుల్లెట్ అందుబాటులో ఉన్నాయి.

ప్రమాదాల నివారణకు సంసిద్ధం



జిల్లాలో ఎక్కడ అగ్నిప్రమాదం జరిగిన సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాం. కొన్ని మండలాలు జిల్లా కేంద్రం నుంచి దూరంగా ఉన్నాయి. వాటి సమీపంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, వేములవాడలో ఉన్న స్టేషన్‌ను డబుల్ యూనిట్‌గా అప్‌డేట్ చేసి, రాజన్న ఆలయంలో సేవలకు వినియోగించాలని ప్రతిపాదనలు పంపాం. సిరిసిల్లకు రీజినల్ ట్రైనింగ్ సెంటర్ కావాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. భవిష్యత్‌లో అన్ని సౌకర్యాలు మన జిల్లాకు రానున్నాయి.

– సతీశ్‌రావు, ఫైర్ ఆఫీసర్, సిరిసిల్ల

అగ్ని ప్రమాదం జరిగితే తక్షణ సహాయం కోసం

ఫైర్ టోల్‌ఫ్రీ	: 101
సిరిసిల్ల	: 8712699258
వేములవాడ	: 8712699260

వృద్ధులకు ఆస్తిహక్కు కల్పించడంపై హర్షం


మాట్లాడుతున్న చేపూరి బుచ్చయ్య

సిరిసిల్ల: వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారసుల నుంచి ఆస్తులను తిరిగి పొందే హక్కును చట్టబద్ధం చేయడంపై హర్షం వ్యక్తంచేస్తున్నట్లు సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య అన్నారు. సిరిసిల్ల వస్త్రవ్యాపార సంఘ భవనంలో గురువారం సీనియర్ సిటిజన్స్‌కు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత కాలం పిల్లల వృద్ధికోసం శ్రమించే వృద్ధులు మలిసంధ్యలో నిరాధరణకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారసుల నుంచి ఆస్తులను వెనక్కి తీసుకొని వృద్ధులకు బదలాయించే విధంగా చట్టం కల్పించడం, ఆ అధికారాన్ని ఆర్డీవో, కలెక్టర్లకు ఇవ్వడం సంతోషకరమన్నారు. సీనియస్ సిటిజన్స్ గుర్తింపు కార్డులు పొంది సదుపాయాలు పొందాలన్నారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జనపాల శంకరయ్య మాట్లాడుతూ వృద్ధులు వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా వృద్ధులు పిల్లల నిరాదరణకు గురయితే ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ వృద్ధుల ఆశ్రమంలో ఆశ్రయం పొందవచ్చన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఏనుగుల ఎల్లయ్య, మడుపు రత్నాదేవి, మాదిరెడ్డి అంజనాదేవి, కోడం శంకర్, మిట్టపల్లి రాములు, నక్క మనోహర్, గజవాడ లక్ష్మయ్య, గడ్డం కౌలస్య, గజ్జెల్లి రామచంద్రం, దొంత దేవదాస్, ఆంకారపు జ్ఞానోభా తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డల పెళ్లికీ కల్యాణ లక్ష్మి

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు


కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తోందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు పేర్కొన్నారు. గంభీరావుపేట రెవెన్యూ కార్యాలయంలో గురువారం పలువురు లబ్ధిదారులకు ఎంపీపీ వంగ కరుణతో కలిసి కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ముస్లింలకు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈనెల 25న నర్మాలలో నిర్వహించే నియోజకవర్గ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అహ్మద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, దయాకర్‌రావు, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఈ ప్రక్రియను పూర్తిచేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల అర్బన్ : జిల్లాలో ఓటరు నమోదు, తొలగింపు, సవరణ కోసం చేపడుతున్న పీఎస్ఈ (ఫొటో – సిగ్నేచర్– ఎంట్రీ) ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. చనిపోయిన వారి వివరాలను ఓటరు జాబితా నుంచి తొలగించాలని, కొత్త ఓటరు నమోదు, సవరణల కోసం దరఖాస్తులు స్వీకరించి, పరిష్కరించాలన్నారు. అభ్యర్థుల నుంచి ఏమైనా అభ్యంతరాలు వస్తే పరిష్కారం చూపాలన్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలకు సంబంధించిన పరిహారం, తదితర అంశాలపై చర్చించారు. వారం రోజుల్లోగా సమస్యలను పరిష్కరించి, జాబితాను అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో టి. శ్రీనివాసరావు, వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్, తహసీల్దార్లు రాజు, నరేశ్, శ్రీనివాస్, సదానందం, పర్యవేక్షకుడు రమేశ్, ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ రెహమాన్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

- కళాశాల విద్యాశాఖ జేడీ రాజేందర్‌సింగ్



మాట్లాడుతున్న కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్

వేములవాడఅర్బన్: విద్యార్థులు డిగ్రీ తర్వాత లక్ష్యానికి అనుగుణమైన ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్ సూచించారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. డిగ్రీ పూర్తయిన తర్వాత అన్ని గ్రూపుల విద్యార్థులకు పీజీ స్థాయిలో మంచి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ఆసక్తికి అనుగుణంగా పీజీ కోర్సులను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. గేట్, ఐఐటీ, సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశపరీక్షల గురించి వివరించారు. బీఏ, బీకామ్ విద్యార్థులు సైతం గేట్ పరీక్ష రాయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా అగ్రహారం డిగ్రీ కళాశాల విద్యార్థులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలలో పీజీ సీట్లు సాధిస్తున్నారని తెలిపారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు మల్లారెడ్డి, మధు రాజేశ్, అఫ్సారీ ఉస్మాని, రమాదేవి, ప్రభాకర్, శ్రీనివాసులు, నారాయణ పాల్గొన్నారు.

సహజ వనరులను కొల్లగొడుతున్నారు


మాట్లాడుతున్న చీటి ఉమేశ్ రావు

సిరిసిల్లటౌన్: జిల్లాలోని సహజ వనరులను అధికార పార్టీ మద్దతుతో అక్రమార్కులు కొల్లగొడుతున్నారని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు ఆరోపించారు. గురువారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీకి చెందిన నేతలు ల్యాండ్, ఇసుకతో పాటు స్టోన్ క్రషర్స్ మాఫియాగా ఏర్పడి సంపాదిస్తున్నారని, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, రాళ్లపేటలో ఎలాంటి అనుమతులు లేకుండా స్టోన్ క్రషర్స్ నడిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక మంత్రి అండదండలతోనే అధికారులు వారిపై కేసులు నమోదు చేయడం లేదన్నారు. అనుమతుల్లేకుండా నడుస్తున్న క్రషర్స్‌ను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అక్రమ ఇసుక, భూ దందాలను నిలువరించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ఎడ్మల భూపాల్ రెడ్డి, రొడ్డ రాంచంద్రం, తిరుపతి, శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ధ్వంసం చేసిన వ్యక్తికి నోటీస్‌లు


ధ్వంసమైన మొక్కలు, చెట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమాదేవి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని తుర్కపల్లిలో హరితహారంలో నాటిన మొక్కలను ధ్వంసం చేసిన కొండి సురేందర్‌కు గురువారం నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సిద్దుల శ్రీనివాస్ తెలిపారు. తుర్కపల్లి, సిరిసిల్ల రహదారికి ఇరువైపులా ఐదేళ్ల క్రితం నాటిన మొక్కలను పూర్తిగా తొలగించారని చెప్పారు. పది పెద్ద చెట్లు, 25 చిన్న మొక్కలు ధ్వంమైనట్లు గుర్తించామని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఈమేరకు రూ.75వేల జరిమానా చెల్లించాలని సురేందర్‌కు నోటీసులు అందజేశామన్నారు. జేసీబీతో మొక్కలు, చెట్లు తొలగించడమే కాకుండా ఆర్అండ్‌బీ రహదారికి చెందిన సిమెంట్ ఖనీలను తొలగించారన్నారు. ఈ విషయంపై ఆ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

కళాశాలసందర్శన


డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ అధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ అధికారుల బృందం గురువారం సందర్శించింది. రెండు రోజులపాటు కళాశాలలోని వసతులు, బోధన విధానం పరిశీలించనుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు నివేదికను సమర్పించారు. గురువారం ల్యాబ్‌లను పరిశీలించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులతో సమాశమయ్యారు. టెస్కాబ్ చైర్మన్, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు న్యాక్ అధికారులను కలిసి కళాశాల అభివృద్ధి చెందిన విధానం, సౌకర్యాల గురించి వివరించారు. న్యాక్ టీమ్ చైర్మన్ ప్రొఫెసర్ అలెగ్జాండర్ జేసుదాసన్, కో–ఆర్డినేటర్ ఆషిరొద్దీన్, సభ్యులు కేశవ్ గోరుడే వచ్చారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు ఉన్నారు .

పుట్టినరోజు వేడుకల్లో వాగ్వాదం

సిరిసిల్ల క్రైం : విద్యార్థి పుట్టినరోజు వేడుకల నిర్వహణ విషయంలో విద్యార్థి బంధువులు, పాఠశాల ప్రిన్సిపాల్‌కు మధ్య వాగ్వాదం జరిగిన ఘటన గురువారం సిరిసిల్లలో చోటు చేసుకుంది. చందుర్తి మండలం.. మూడపెల్లికి చెందిన సిరిగిరి నితీశ్ సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూర్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. నితిశ్ పుట్టినరోజు సందర్భంగా తల్లి సిరిగిరి అనిత, బంధువు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు రంజిత్ పాఠశాలలో కేక్ కట్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు. దీనికి వారు నిరాకరించడంతో ప్రిన్సిపాల్‌తో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని రంజిత్ కోరగా దురుసుగా ప్రవర్తించారు. విద్యార్థి పుట్టిన రోజు సందర్భంగా వచ్చిన కుటుంబీకులను అవమానపర్చారని రంజిత్ ఆరోపించారు. ప్రిన్సిపాల్‌తో పాటు, సిబ్బంది తనపై దాడిచేశారని, విద్యార్థి తల్లిని బెదిరించినట్లు తెలిపారు. దీనిపై సీసీ పుటేజీ, వీడియోను జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌ను వివరణ కోరగా పాఠశాలలో జన్మదిన వేడుకలు నిర్వహించేందుకు అనుమతి లేదని, మిగతా విద్యార్థులకు అసౌకర్యం కలగవద్దనే సూచించినట్లు తెలిపారు. విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడి పాఠశాల ఆవరణలో బర్త్ డే నిర్వహించినట్లు తెలిపారు.

లీకేజీలు, స్కాంలు దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు

- ప్రభుత్వ విధానాలతో విద్యార్థులు, ప్రజల్లో అసహనం
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాలకు ఉజ్వల భవిష్యత్తు
- వ్యవసాయ కూలీలకు కూలీబంధు
- పీపుల్స్ మార్చ్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క


చిరువ్యాపారుల వద్ద బజ్జీలు వేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

కాల్వశ్రీరాంపూర్:లీకేజీలు, స్కాంలు దేశ భవిష్యత్‌కు గొడ్డలి పెట్టు అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో విద్యార్థులు, ప్రజలు నిరాశకు లోనై అసహనం వ్యక్తం చేస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ గురువారం గంగారంలో ప్రారంభమై.. కాలవ్వశ్రీరాంపూర్, ఇప్పలపల్లి, మల్యాలకు చేరుకుంది. కాల్వశ్రీరాంపూర్ బహిరంగసభలో భట్టి మాట్లాడుతూ.. ప్రాజెక్టులు నిర్మించి సాగునీరు రైతుకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మధ్యాహ్నం పలువురు విద్యార్థులు భట్టిని కలిసి తమ సమస్యలు వివరించారు. ఫీజురీయంబర్స్‌మెంట్ విడుదల చేయలేదని, స్కాలర్‌షిప్‌లు అందక విద్యాభ్యాసం చేయలేకపోతున్నామని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చాక అన్నివర్గాలకు మేలు చేస్తామని భట్టి హామీ ఇచ్చారు. కూలీబంధు తెచ్చి వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు అందిస్తామన్నారు. అభయహస్తం, స్వశక్తి మహిళలకు పావలావడ్డీతో రుణాలిప్పిస్తామని తెలిపారు.

దోచుకుంటున్న మంత్రులు..

రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టారీతిన దోచుకుంటున్నారని భట్టి తెలిపారు. అక్రమ దందాలు, లిక్కర్ స్కాంలతో ప్రజాధనాన్ని గుల్ల చేస్తున్నారని విమర్శించారు.

క్రీడాప్రాంగణంలోనే శ్మశాన వాటికలా..

ఇప్పలపల్లిలో క్రీడాప్రాంగణం, శ్మశాణ వాటికను పరిశీలించారు. రెండూ ఒకేచోట నిర్మాణం చేయడంపై విస్మయం వ్యక్తం చేశారు. శ్మశానవాటికలో ఆడుకునేందుకు ఎవరైనా సుముఖత వ్యక్తం చేస్తారా..? ఇదేనా బంగారు తెలంగాణ అన్నారు.

పలకరిస్తూ.. ముందుకుసాగుతూ..

భట్టి విక్రమార్క తన పాదయాత్రలో ప్రజలతో మమేకమయ్యారు. వారి ఇబ్బందులు తెలుసుకుంటూ భరోసా ఇస్తూ.. ముందుకుసాగారు. మండల కేంద్రంలోని ఓ హోటల్ వద్ద ఆగి బజ్జీలు, పునుగులు వేశారు. రోజు కష్టపడితే ఎంత వస్తోందని, కుటుంబపోషణకు సరిపోతున్నాయా..? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వస్తే గ్యాస్ ధర తగ్గిస్తామన్నారు. మత్స్యకార్మికులు చేపలవల, బుట్ట బహూకరించారు. గొర్రెలకాపరులతో మాట్లాడుతూ.. సబ్సిడీపై గొర్రెలు ఇవ్వడంతోపాటు అనుబంధ పరిశ్రమలు, మటన్ మార్కెట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

నక్సలైట్లకు పునరావాసం కింద భూములిచ్చి లాక్కున్నారు

అభివృద్ధి అంటే పేదలకిచ్చిన అసైన్డ్ భూములు, లొంగిపోయిన నక్సల్స్ పునరావాసానికి ఇచ్చిన భూములు లాక్కోవడమేనా..? ఇదేనా బంగారు తెలంగాణ..? అని భట్టి ప్రశ్నించారు. మల్యాలలో మాట్లాడుతూ అంతర్గాంలో అసైన్డ్‌భూములు లాక్కొని ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇసుక, మట్టిమాఫియా రాజ్యమేలుతోందన్నారు. బినామీ పేర్లతో జిల్లాలో 21 ఇసుకరీచ్‌లు నడుపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ములుగు ఎమ్మెల్యే సీతక్క, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, నాయకులు ఈర్ల కొమురయ్య, మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, నాయకులు లంక సదయ్య, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ అన్వేష్ రెడ్డి, జెడ్పీటీసీ గంట రాములు, సర్పంచ్ కొమురయ్య గౌడ్, లంక రాజేశ్వరి, ఎంపీటీసీ సదానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మునీర్, కట్కూరి సుధాకర్ రెడ్డి, మనోహర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, మౌనిక రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

జిల్లాలో ముగిసిన భట్టి పాదయాత్ర

ఓదెల: మంచిర్యాల మీదుగా రామగుండం మండలం ఎల్లంపల్లి వద్ద జిల్లాలోకి ప్రవేశించిన భట్టి పాదయాత్ర.. గురువారం రాత్రి ఓదెల మండలం గుంపుల వద్ద ముగిసింది. మానేరు నది దాటి జమ్మికుంట మండలం తనుగులకు చేరుకుంది. ముందుగా గుంపుల గ్రామంలోనే ఆయన బస చేయాల్సి ఉండగా.. తనుగులకు చేరుకుని అక్కడ బస చేశారు.

కోటి మందికి బతుకమ్మ చీరలు

- రూ.340 కోట్లతో ఆర్డర్లు
- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్


మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల: రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగ కానుకగా చీరలను అందిస్తుందని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ తెలిపారు. సిరిసిల్లలోని నెహ్రూనగర్ భవాని ఫంక్షన్‌హాల్‌లో గురువారం మనోవికాస సదస్సు నిర్వహించారు. ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇస్తుందన్నారు. ఈ ఏడాది రూ.340 కోట్ల ఆర్డర్లు ఇచ్చిందని వివరించారు. వైద్యశాఖకు అవసరమైన బ్యాండేజ్ క్లాత్, గ్లాస్‌క్లాత్, బెడ్‌షీట్స్ తయారీ ఆర్డర్లు కూడా సిరిసిల్లకు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 6 లక్షల మంది బడి పిల్లలకు రెండు జతల బట్ట తయారీ బాధ్యత సిరిసిల్ల వస్త్రపరిశ్రమకే ప్రభుత్వం అందించిందని గుర్తు చేశారు. త్రిఫ్ట్ పథకంలో అందరూ చేరాలని కోరారు. జౌళిశాఖ ఏడీ సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్ల సకాలంలో పూర్తి చేయాలని కోరారు. మనోవికాస కేంద్రం సైకాలజిస్ట్ కె.పున్నంచందర్, హెల్పింగ్ హార్ట్స్ సంస్థ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, బీఆర్ఎస్ స్థానిక నాయకులు గుండ్లపల్లి గౌతమ్, తాటి వెంకన్న, ఆసాముల సంఘం అధ్యక్షుడు రవి, మనోవికాస కేంద్రం సిబ్బంది ఉమ, లత పాల్గొన్నారు.

గీత కార్మికులకు అండగా ఉంటాం

ముస్తాబాద్ (సిరిసిల్ల): గీత కార్మికులను ఆదుకునేందుకు 'గోప' అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్ గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అమరేందర్ గౌడ్ మాట్లాడుతూ..పేద గౌడ విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. సమస్యలు, ఇబ్బందుల్లో ఉన్నవారికి చేయూతందిస్తామని తెలిపారు. ప్రభుత్వం గౌడ్‌ల అభివృద్ధికి పథకాలు అందేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లెల్ల శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి బాలాగౌడ్, కదిర పర్శరాములు, ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్, పరుశరాములు, అంజాగౌడ్, నాంపెల్లి, శ్రీనివాస్, బాలకృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.